ప్రజాశక్తి
ఆదివారం 14 సెప్టెంబర్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

గుంటూరులో వర్షం బీభత్సం

పెదకాకాని, పెదనందిపాడు వద్ద పిడుగుపాటుకు నలుగురి బలి - నగరంలో పలు కాలనీల్లోకి నీరు చేరి ప్రజల నరకయాతన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/పెదకాకాని, పెదనందిపాడు

గుంటూరు విద్యానగర్‌లో

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షంతో దాదాపు రెండు గంటల పాటు వర్షం బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. పిడుగుపాటుకు వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు మృతి చెందారు. పెదకాకాని మండలం నంబూరు వద్ద పిడుగుపాటుకు దాసరి రాణి (42), శారమ్మ (40) అనే ఇద్దరు మహిళలు దుర్మరణం పాలయ్యారు. పెదనందిపాడు మండలం అనపర్రు వద్ద పిడుగుపాటుకు నాగమ్మ, సామ్రాజ్యం అనే మరో ఇద్దరు మహిళలు మృతి చెందారు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల పిడుగులు పడిన భీకర శబ్దాలతో దాదాపు రెండు గంటల పాటు వర్షం బీభత్సం సృష్టించింది. గుంటూరులోని పలు కాలనీల్లోకి వర్షం నీరు ప్రవేశించింది. డ్రైనేజి నీరు, వర్షం నీరు కలసి పారడం, ఈ నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 18వ డివిజన్‌లో డ్రైన్లన్నీ పూడిక లేక మునిగిపోయి వర్షం నీరు రోడ్లపై ఏరులై పారింది. కెవిపి కాలనీలో చాలా ఇళ్లలోకి డ్రైనేజి నీరు ప్రవేశించింది. గుంటూరులో పిడుగుపాటుకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం అయి అపార్టుమెంట్‌లోకి మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్ని మాపక శాఖ అధికారులు వచ్చి మంటలను అదుపు చేశారు. గుంటూరు డొంకరోడ్డులో విద్యుత్ స్తంభం వైర్లు తెగిపడి మంటలు వ్యాపించాయి. స్థానికులు భయాందోళ నలతో పరుగులు తీశారు. వర్షంతో పలు ప్రాంతాల్లో పైర్లు నీట మునిగాయి. తెనాలి, పొన్నూరు, మంగళగిరి, గుంటూరు నియోజకవర్గాల్లోని పొలాల్లోకి నీరు చేరడంతో వరి, పత్తి పంటలకు నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. మరో వైపు వర్షాలతో పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంటూరులోని మూడు వంతెనల రహదారి, కంకర గుంట ఆర్‌యూబి వద్ద నీరు నిలిచింది. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యానగర్, అమరావతి రోడ్డు, డొంక రోడ్డు, నెహ్రూనగర్, ఆర్‌టిసి కాలనీ, చుట్టుగుంట, ఎన్‌జివో కాలనీ, ఎటి అగ్రహారం, నగరంపాలెం, మస్తాన్ దర్గా, మార్కెట్ సెంటర్, పెదకాకాని రోడ్డు, మంగళదాస్ నగర్, పాత గుంటూరు,సుద్ధపల్లి డొంక, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పల్నాడు జిల్లాలోని అమరావతి, సత్తెనపల్లి, నర్సరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

గుంటూరు మూడు వంతెనల వద్ద

బాధ్యతలు స్వీకరించిన గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు తమీమ్ అన్సారియా, కృతికా శుక్లా

క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రాధాన్యం

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి : గుంటూరు జిల్లా నూతన కలెక్టర్ తమీమ్ అన్సారియా

పల్నాడు అభివృద్ధికి కృషి : పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా నూతన కలెక్టర్‌గా ఎ.తమీమ్ అన్సారియా శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి కషి చేస్తానన్నారు.క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లి పాలనలో ఉన్న లోపాలను సరిదుద్దుతానని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని అర్థం చేసుకొని సమర్థవంతంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తానన్నారు .ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు . అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తానన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివద్ధి పనులకు వేగవంతంగా పూర్తిచేయడం జిల్లా స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ ప్రకారం జిడిపిని పెంచడానికి ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు, మీడియా ప్రతినిధులు మీ అందరి సలహా సహకారంతో కలిసేటట్టుగా పనిచేసే గుంటూరు జిల్లా

2లో

గుంటూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే విధంగా 0863-2234014 నంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టులలో విధులు నిర్వహించేలా ఉద్యోగులు నియమించినట్లు చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు ఉంటే ప్రజలు కంట్రోల్ రూమ్‌కు తెలియజేస్తే సంబంధిత అధికారులు వెంటనే సహాయం అందిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

కౌలు రైతుల సమస్యలపై 22న చలో అసెంబ్లీ

వార్త మెయిన్ పేజీలో

ప్రజారోగ్యంపై తొలగని నిర్లక్ష్యం

వీక్షణం ▶ 8లో

ఇద్దరు ఎస్‌పిల బదిలీ

గుంటూరుకు వకుల్ జిందాల్ - పల్నాడుకు కృష్ణారావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్

పల్నాడు జిల్లా ఎస్‌పి డి కృష్ణారావు

గుంటూరు, పల్నాడు జిల్లాల ఎస్‌పిలు బదిలీ అయ్యారు. విజయనగరం ఎస్‌పి వకుల్ జిందాల్‌ను గుంటూరు ఎస్‌పిగా, బిఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా ఎస్‌పి డి.కృష్ణారావును పల్నాడు జిల్లా ఎస్‌పిగా బదిలీ చేశారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ప్రకాశం, బాపట్ల జిల్లా ఎస్‌పిగా పనిచేసిన వకుల్ జిందాల్ 2016 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. 2014 బ్యాచ్‌కు చెందిన కృష్ణారావు కోనసీమ జిల్లా నుంచి పల్నాడుకు వస్తున్నారు. వీరిద్దరూ ముక్కుసూటిగా పనిచేస్తారన్న పేరుంది. ఇప్పటి వరకు గుంటూరు ఎస్‌పిగా ఉన్న ఎస్.సతీష్‌కుమార్‌ను శ్రీ సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. పల్నాడు ఎస్‌పి కె.శ్రీనివాసరావుకు ఇంకా పోస్టింగ్ కేటాయించలేదు. మొత్తంగా రెండు రోజుల వ్యవధిలో జిల్లాలో కలెక్టరు, ఎస్‌పిలు బదిలీ అయ్యారు. గుంటూరు ఎస్‌పి సతీష్‌కుమార్ బదిలీ గురించి చాలా కాలంగా ప్రచారం జరుగుతుంది. అయితే ఆయనకు మళ్లీ కొత్త జిల్లా శ్రీసత్యసాయికి బదిలీ చేయడం అధికార పార్టీలో కొంత కలకలం రేపింది. గతంలో వివిధ కేసుల్లో వైసిపి నేతలకు అనుకూలంగా పనిచేస్తున్నారన్న అపవాదులు సతీష్‌కుమార్ పై వచ్చాయి. పలు కేసుల్లో వైసిపి నేతల అరెస్టు, ఆ తరువాత పరిణామాలు పెద్ద ఎత్తున దుమారం లేపాయి. కొన్నిఘటనలు పోలీసుల శాఖలో చర్చనీయాంశం అయ్యాయి. అయితే కింది స్థాయి అధికారుల తప్పిదాలకు కూడా ఎస్‌పి సమాధానం చెప్పుకోవాల్సి వచ్చింది. గత ప్రభుత్వ హయంలో కాకినాడ జిల్లా ఎస్‌పిగా పనిచేస్తూ బదిలీపై వచ్చిన ఆయన దాదాపు 15 నెలలు పాటు జిల్లాలో పనిచేశారు. పల్నాడు జిల్లా ఎస్‌పి శ్రీనివాసరావు విజయవాడ డిసిపిగా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు గత ఏడాది ఆగస్టులో జిల్లా ఎస్‌పిగా నియమితుల

2లో

సమాశంలో మాట్లాడుతున్న నేతాజి

కొత్తరెడ్డిపాలంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు గ్రామం శివారు ప్రాంతం కొత్తిరెడ్డిపాలెంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని సిపియం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. శనివారం బ్రాడీపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమాఏశంలో వై.నేతాజి మాట్లాడుతూ గుంటూరు రూరల్ మండలం, తురకపాలెంలో ఆసాధారణ మరణాలకు ఇంత వరకు స్పష్టమైన కారణాన్ని ప్రభుత్వం కనిపెట్టలేకపోయిందన్నారు. ఈ ఘటన మరవక ముందే ఆవే లక్షణాలతో చేబ్రోలు శివారు ప్రాంతం కొత్తరెడ్డి పాలెంలో శుక్రవారం ఆశావర్కర్ మరణించిందన్నారు. ఈ నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వైద్య ఆరోగ్యశాఖ వేగంగా కదలాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే చేబ్రోలు, కొత్తరెడ్డిపాలెం, పాత రెడ్డిపాలెంలలో వెంటనే ఇంటింటికి వైద్యపరీక్షలు చేయాలని, అనుమానితులకు అధికారులే దగ్గరుండి ప్రభుత్వ హస్పిటల్‌లో చేర్పించే ప్రయత్నం చేయాలని, అక్కడ 24 గంటల మెడికిల్ క్యాంప్ నిర్వహించాలని కోరారు. అదే విధంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జ్వరానికి సంబంధించి గాని, ఇతర ఆనారోగ్య సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా చేబ్రోలులో ఉన్న పి.హెచ్.సి వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్యసహాయం పొందాలని సూచించారు. తురకపాలం వలే దుష్పరిమాణాలు పునరావతం జరకుండా ప్రజలు, ప్రభుత్వ కూడా అప్రమత్తమై చేబ్రోలు ప్రజలు ప్రాణాలు పోకుండా ఉమ్మడి ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.ముత్యాలరావు, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

అభివద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడానికి మనస్ఫూర్తిగా కషి చేస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ ,జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ కే ఖాజావలి. గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు, పి డి ఆర్ డి ఏ విజయలక్ష్మి, డిఇఓ ఈ రేణుక, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి, జి జి హెచ్ సూపర్డెంట్ డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మురళీధర్, డిపిఓ నాగ సాయికుమార్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దుర్గాబాయి, మెప్మా పిడి విజయలక్ష్మి, ఐ సి డి ఎస్ పిడి ప్రసూన, డి డి హార్టికల్చర్ రవీంద్రబాబు, కలెక్టర్ కార్యాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

. ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా కతిక శుక్లా శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆమె జిల్లాకు తొలి మహిళా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కృతిక శుక్లాను కలిసి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాకు మొదటి మహిళా కలెక్టర్‌గా కృతిక శుక్లా నియామకం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు జిల్లాలోని అర్హులకు ఆటంకం లేకుండా అందేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలాలని కోరారు. స్పందించిన కలెక్టర్ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ జిల్లాను అభివృద్ధి మార్గంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని కలెక్టర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో కోస్తాకు అన్యాయం

ఎబి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి రంగం నిర్లక్ష్యానికి గురైందని, ప్రధానంగా కోస్తా ఆంధ్రకు తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ ఐపిఎస్ అధికారి ఎ.బి.వెంకటేశ్వరరావు తెలిపారు. గుంటూరు బాలానంద కేంద్రంలో శనివారం ఆలోచనపరుల వేదిక ఆధ్వర్యంలో నదీ జలాల హక్కుల పరిరక్షణ, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వేదిక కన్వీనర్ మల్లిఖార్జునరావు అధ్యక్షత వహించారు. వెంకటేశ్వరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ పోలవరం దశాబ్దాలుగా కొనసాగుతుందన్నారు. ప్రాజెక్టు డిజైన్లు, నిర్మాణం మొత్తం రైతుల ప్రయోజనాల కోసం జరగాలన్నారు. గత 40 ఏళ్లలో కోస్తా ఆంధ్రకు ఒక్క భారీ ప్రాజెక్టు కూడా కేటాయించలేదన్నారు.మిగులు జలాలను వాడుకునే హక్కు చివరి రాష్ట్రం కావడం వల్ల ఎపికే అవకాశం ఉంటుందన్నారు. మిగులు జలాలపై తెలంగాణ లేని పోని రాద్ధాంతం చేసి అక్రమ ప్రాజెక్టులను నిర్మించుకుంటోందని తెలిపారు. బచావత్ ట్రిబ్యునల్ తీర్పులను తెలంగాణ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేసి తరువాతనే కొత్త ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు.

19న యుటిఎఫ్ రణభేరి యాత్ర

సమావేశంలో మాట్లాడుతున్న కుసుకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, విద్యా రంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుండి 19వ తేదీ వరకూ రణభేరి ప్రచార యాత్రలు చేపడుతున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎ.ఎన్.కుసుమకుమారి తెలియజేశారు.యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో కుసుమకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమస్యలు పట్టించుకోవట్లేదన్నారు. బోధన కంటే వర్క్‌బుక్స్, పరీక్షలు, ఆన్‌లైన్ పనులతో ఒత్తిడి పెంచారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ 19న గుంటూరు జిల్లాలో యాత్ర జరుగుతుందన్నారు. ఉదయం గుంటూరులో ప్రారంభం అయ్యి ఏటుకూరు, ప్రత్తిపాడు, కాకుమాను, పొన్నూరు, చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి, అంగలకుదురు మీదుగా తెనాలి వరకూ ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కోశాధికారి ఎన్.తాండవకష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం పూర్తిగా వదిలేశాయన్నారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ తక్షణమే 12వ పిఆర్‌సి కమిటీని నియమించి, ఐఆర్ ఇవ్వాలని, బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు పి.వి శ్రీనివాసరావు, సహాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండి.దౌలా, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, ఎం.డి.షకీలాబేగం, టి.ఆంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, కె.రంగారావు, కె.కామాక్షి, కె.కేదార్‌నాథ్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

మాచర్ల పట్టణంలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణ, పరిసర గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం నుండి ఓ మోస్తరుగా ప్రారంభమైన వర్షం సాయంత్రం భారీగా కురిసింది. దాంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక నెహ్రూనగర్, 13వ వార్డు, సుద్దగుంతల ప్రాంతాల్లో రోడ్లపై నీరు పారింది. సైడు కాల్వలు పోర్లి రోడ్లపై 3 అడుగుల నీరు చేరటంతో రోడ్లపై వాహనాలు కొంతమేర నీటమునిగాయి. కొందరి ఇండ్లలోకి మురుగునీరు చేరింది. రోడ్లపై నీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు మండలంలో శనివారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి మేడికొండూరు గ్రామంలోని ఎడ్లపాటి వెంకట్రావు కాలనీ వెళ్లే లో లెవెల్ బ్రిడ్జి పై భారీ స్థాయిలో వరద ప్రవహిస్తోంది. కాలనీలో ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు చెందిన సుమారు 100 కుటుంబాలు పైగా నివాసముంటున్నారు. వర్షాల వల్ల ఈ వాగు ప్రవహిస్తున్నప్పుడు కాలనీ విద్యార్థులు స్కూళ్లకు వెళ్లడానికి వీలు కాని పరిస్థితి నెలకొంది. అనేక సందర్భాల్లో సైతం ఈ కాలనీవాసులు హై లెవెల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు అనేకసార్లు మొరపెట్టుకున్నారు. ఇకనైనా అధికారుల స్పందించి మేడికొండూరు లోని ఎడ్లపాటి వెంకట్రావు కాలనీ వెళ్లే దారిలో హైలెవెల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిందిగా కాలనీవాసులు రాజకీయ నాయకులను, అధికారులను కోరుచున్నారు.

గుంటూరులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 1 తర్వాత ప్రారంభమైన వర్షం సాయంత్రం 4 గంటల వరకూ ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. నల్లమబ్బులతో పగటిపూటే చీకట్లు అలముకున్నాయి. వర్షం కారణంగా రోడ్లు జలమయం అయ్యాయి. ముఖ్యంగా కంకరగుంట రైల్వే అండర్ బ్రిడ్జిలో పెద్ద ఎత్తున నీరు నిలిచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వాహనాలు అన్నీ కంకరగుంట ఫ్లైఓవర్‌పైనే ప్రయాణించాల్సి రావటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వర్షం వెలిసే వరకూ వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే విధంగా మూడు వంతెనలకింద కూడా పెద్ద ఎత్తున నీరు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనాల ఇంజిన్లలోకి నీరు చేరి మొరాయించాయి.మధ్యాహ్నం సమయంలో ఊహించని విధంగా భారీ వర్షం కరవటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కాల్వలు పొంగి మురుగునీరు రోడ్లపైకి వచ్చింది. అనేక చోట్ల వర్షం ధాటికి తారు రోడ్లు దెబ్బతిన్నాయి. కంకరపైకి తేలింది.

గుంటూరులో అభివృద్ధి పనులు వేగవంతం

రూ.125 కోట్ల నిధులకు ప్రతిపాదనలు

అమృత్ పథకం పనుల పై సమీక్ష

మంత్రి నారాయణతో కలిసి పెమ్మసాని ఎమ్మెల్యేల సమావేశం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరును మరింత అభివృద్ధి పరచేందుకు పెమ్మసాని ప్రణాళికలు రచిస్తున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు స్ట్రాంగ్ వాటర్ డ్రైన్ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకుగాను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో స్థానిక ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద గల్లా మాధవి రామాంజనేయులు తో కలిసి ఆయన తన క్యాంపు కార్యాలయంలో శనివారం సమీక్ష చేపట్టారు. ఇందులో భాగంగా రూ 48 కోట్లతో ప్రారంభం కానున్న ఇన్నర్ రింగ్ రోడ్డు పనులను తాత్కాలికంగా ఆపి, ఇన్నర్ రింగ్ రోడ్డు తో పాటు మరో రూ. 70 కోట్ల వ్యయంతో స్ట్రాం వాటర్ డ్రైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. వెరసి రూ. 128 కోట్ల వ్యయంతో ఇన్నర్ రింగ్ రోడ్డుతో పాటు స్ట్రాంగ్ వాటర్ ట్రైన్లను చేపడితే గుంటూరు శివారు ప్రాంతాల్లో రాకపోకల ఇబ్బందులు పూర్తిగా పరిష్కారం అవుతాయని సమీక్షలు చర్చించారు. ఇందుకు మంత్రి నారాయణ కూడా సుముఖత వ్యక్తం చేశారు. అలాగే అమృత్ పథకం ద్వారా చేపడుతున్న గోరంట్ల ట్యాంక్ పనులను కూడా వేగవంతం చేయాలని, అమృత్ 2.0 టెండర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు , సి ఆర్ డి ఏ ఇంజనీరింగ్ చీఫ్ కష్ణారెడ్డి , పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ప్రభాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో శానిటేషన్ లోపంపై పెమ్మసాని ఆగ్రహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్య సమస్యలు ఉత్పన్నం కావడంపై గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. చికిత్స నిమిత్తం వచ్చిన ప్రజలను నేరుగా కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జిజిహెచ్‌లో సౌకర్యాలను, ఎక్విప్మెంట్, వైద్యుల పనితీరు తదితర ఏర్పాట్లపై రోగులనుంచి అభిప్రాయాలు అడిగారు. కాగా శానిటరీ సమస్యలు, మరుగుదొడ్లలో ఇబ్బందులు ఉన్నాయని రోగులు ఈ సందర్భంగా పెమ్మసానికి విన్నవించారు. కాగా సూపరిండెంట్ రమణతో పాటు శానిటరీ సిబ్బందిని వెంటనే పిలిపించిన పెమ్మసాని సమస్యలకు తగిన పరిష్కారాలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు రానందున కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయలేకపోతున్నాం అన్న శానిటరీ అధికారుల వివరణ విన్న వెంటనే బకాయిలను వెంటనే తెప్పించాలని అధికారులకు సూచించారు. తాను కూడా ఫాలోఅప్ చేసి పెండింగ్ బిల్లులను తెప్పించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. అనంతరం ఓ.పి, ఐ.సి.యు, ఎమర్జెన్సీ, వార్డులను పరిశీలించారు. అలాగే ఇటీవలే తురకపాలెంలో ఆరోగ్య సమస్యలతో జిజిహెచ్ లో అడ్మిట్ అయిన బాధితులను కూడా ఆయన కలిసి పరామర్శించారు. ఆయా రోగుల ఇబ్బందులను వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్వతహాగా వైద్యులు అయిన పెమ్మసాని ట్రీట్మెంట్ విషయంలో కూడా వైద్య హక్కు పలు సలహాలు అందజేశారు. ఏదైనా అవసరం వచ్చినా వెంటనే తెలియజేయాలని సూపరిండెంట్‌కి, వైద్యులకు స్పష్టం చేశారు.

ఇద్దరు ఎస్‌పిల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

య్యారు. అప్పటి నుంచి శాంతిభద్రతల పరిరక్షణలో చురుగ్గాపనిచేసినా మాచర్లనియోజకవర్గంలో జరిగిన ఇద్దరు టిడిపి కార్యకర్తల హత్య కేసు వివాదస్పదం కావడం ఎస్‌పికి ఇబ్బందికరంగా మారింది. టిడిపిలో వర్గ పోరాటాల వల్లే ఇద్దరు టిడిపి కార్యకర్తల హత్య జరిగిందని ఎస్‌పి ప్రకటించిన కొద్ది సేపటికే వైసిపి కోవర్టు రాజకీయాల వల్లే తమ పార్టీ కార్యకర్తలు హత్యకు గురయ్యారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రకటించడం సంచలనం రేపింది. అంతేగాకుండా పల్నాడు లో ఫ్యాక్షనిజం, ముఠా తగదాలను నియంత్రించకలిగినా కొంత మంది ప్రజా ప్రతినిధుల అసంతృప్తి ఆయన బదిలీకి కారణం అని తెలుస్తోంది. అంతేగాక నిత్యం పల్నాడు జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు పెరుగుతున్నాయి. విఐపిల పర్యటనలు వివాదస్పదం అవుతున్నాయి. ఇటీవల మాజీ సిఎం జగన్ సత్తెనపల్లి పర్యటనలో పోలీసుల వ్యవహరించిన తీరు పైనా విమర్శలు వచ్చాయి.

లభ్యమైన అంజిరెడ్డి మృతదేహం

పట్టాల వెంట గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తెనాలి

తెనాలి రైల్వే స్టేషన్ సౌత్ క్యాబిన్ వద్ద పట్టాల వెంబడి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్పి ఎస్ఐ వెంకటాద్రి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా మృతుని వయసు 55 - 60 మధ్య ఉంటుందని, ట్రాక్ దాటే సమయంలో గుండె పోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు చెప్పారు. వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

సాగర్ కుడి కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. విజయపురి సౌత్ ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ రెంటాలకు చెందిన పల్లె అంజిరెడ్డి(35) అప్పుల బాధతో మనస్తాపానికి గురై తాళ్లపల్లి కుడి కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. బుగ్గవాగు వద్ద అంజి రెడ్డి మతదేహం గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుకు యువకుడు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పాము కాటుకు గురయ్యి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం గుడి పూడి గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కల్లి వీరాంజనేయులు (18)ఇంట్లో కింద నిద్రిస్తుండగా కట్లెల పాము యువకుడిని కరిచింది. వెంటనే కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. వ్యవసాయ పనులు చేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. చేతికందివచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు యలమందయ్య, వంకాయమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పిన టిప్పర్ లారీ బోల్తా

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ అదుపతప్పి పడి పోయిన ఘటన స్థానిక తహశీ ల్దార్ కార్యాలయం వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పరిమితికి మించి అధిక ఇసుక లోడుతో సత్తెనపల్లి వైపు నుండి నర్సారావుపేట వెళ్తున్న టిప్పర్ లారీ తహశీల్దార్ కార్యాలయం వద్దకు రాగానే సత్తెనపల్లి, నర్సా రావుపేట రోడ్డు పైనే అదుపుతప్పి పడిపోయింది. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ జన వాసాల పక్కనే పడినా వర్షం కురుస్తుండడంతో జన సంచారం లేక పెను ప్రమాదం తప్పింది. సత్తెనపల్లి, నర్సారావుపేట రోడ్డులో నిరంతరం వందల సంఖ్యలో ఇసుక లారీలు అధిక లోడుతో, అతి వేగంగా వెళ్ళుతుండడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో నని మండల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద స్థలాన్ని ఎస్ఐ సోమే శ్వరరావు పరిశీలించి విచారణ చేపట్టారు.

రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

వాహనదారులకు ఆటంకంగా ...

వీధి కుక్కలతో బెంబేలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విశ్వాసానికి మారుపేరుగా కుక్కలనే చెబుతాం. అటువంటి కుక్కలు నేడు ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. పట్టణంలో 39వార్డు లున్నాయి. వీటిల్లో సుమారుగా 140 నుంచి 160 వీధులున్నాయి. గతంలో రెండు, మూడు వీధులకు 1, 2 కుక్కలుండేవి. ప్రస్తుతం సాలు సాగటున 5, 6గా పెరిగి సుమారు 4,500గా తయారయ్యాయి. గతంలో రాత్రి వేళల్లో కుక్కలకు భయపడి కొత్తవారు వచ్చే వారు కాదు. అయితే ప్రస్తుతం కథ తిరగబడి అన్ని వీధి శునకాలు కొత్త పాత, అనే భేదం లేకుండా శివాలెత్తుతున్నాయి. వీటి బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. ఒంటరిగా వీధుల్లోకి వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. గుంపులుగా వెళ్తున్నా కుక్కలు దాడి చేస్తున్నాయి. ఇవి వాహనాలదారులనూ వదలిపెట్టడం లేదు. ద్విచక్ర వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. కుక్కల నివారణ నిర్మాణాత్మక చర్యలు చేపట్టాక పోవటంతో రోజురోజుకు కుక్కల దాడికి గురైనబాధితులు పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు న్నాయి. పట్టణంలో రోజూ ఎక్కడో ఒక చోట కుక్కల దాడిలో ఒక రిద్దరు గాయపడుతూనే ఉన్నారు. జూలై, ఆగస్టునెలల్లో సుమారు సుమారు 79 మంది కుక్కల దాడికి గురయ్యారు. అధికారులు స్పందించి కుక్కలను పట్టుకొని దూరప్రాంతాలలో వదిలేయాలని కోరుతున్నారు. కుక్క కరిచిన చోట వెంటనే సబ్బు నీటితో శుభ్రపరచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కుక్కకరిచి వేసుకునే రేబిస్‌వ్యాక్సిన్ కావురు పిహెచ్‌సి పరిధిలో అందుబాటులో ఉందని డాక్టర్ రాజేష్ తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఆరు పిహెచ్‌సిలున్నాయి. పట్టణాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లోనూ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచామని తెలిపారు. కుక్కకాటుకు గురైన వారు సకాలంలో ఆసుపత్రికి వచ్చి వ్యాక్సిను వేయించుకోవాలని డాక్టర్లు సూచించారు.

ఇళ్ల మధ్యన గుంపుగా ...

పెట్రోల్ బంకుల్లో కనిపించని కనీస సదుపాయాలు

ఎనిమిది గంటలకు బదులు 14,15 గంటలు పని చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో, చుట్టూ ప్రక్కల షుమారుగా 14 పెట్రోల్ బంకులున్నాయి. వాటిల్లో పెట్రోల్, డీజిల్ కాళీ కొట్టటానికి, ఇతర పనులకు ఒకొక్క బంకులో ఒకొక్క షిఫ్ట్‌లో ఆరుగురు చొప్పున మూడు షిఫ్టులకు 18 మంది, మేనేజర్ ఇతరులతో మొత్తం 20 మంది ఉండాలి. అంటే పట్టణంలో ఉన్న మొత్తం 14 బంకుల్లో సుమారు 400మంది సిబ్బంది ఉండాలి అయితే ప్రస్తుతం 20 0/250 వందల మందితోనే పనులు చేయిస్తున్నారు. ఇదోఎత్తయితే వాహనదారులకు కనీస సౌకర్యాలు కల్పించటంలో విఫలమైన పెట్రోల్ బంకు యాజమాన్యాలు కనీసం అక్కడ పని చేసే వారికీ ఎలాంటి సౌకర్యాలు లేవు. అనుకోని ప్రమాదాలు సంభవించినపుడు వాటర్ స్టోరేజీ గ్యాస్‌పైపులు ఇసుక, వాటర్, బకెట్లు మంటలను అదుపు చేసే గ్యాస్ పరికరాలు కొన్ని బంకుల్లో సక్రమంగా లేవు. అన్నింట్లో కొన్ని సౌకర్యాలు ఉంటే మరి కొన్నింట్లో కొన్ని సౌకర్యాలు ఉండటం లేదు. కనీసం మరుగుదొడ్లు కూడా ఉండవు. గాలి కొట్టేందుకు మిషన్లు ఉంటాయి కానీ అవి ఎప్పుడూ పని చేయవు.. ఒకవేళ పని చేసినా కుర్రాళ్ళు ఉండరు. అక్కడ 8 గంటలకు బదులు 12, 14 గంటల పనులను చేయించుకుంటూ కనీసం ఓటి కూడా ఇవ్వటం లేదని సిబ్బంది వాపో తున్నారు. ఎటిఎం క్రెడిట్, డెబిట్ కార్డుల స్వైపింగ్తో వినియోగ దారుల నుంచి రెండు శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. పట్టణ గ్రామ ప్రాంతాలల్లో ఏటీఎం సెంటర్లు పని చేయని సమయాల్లో, వినియోగదారులకు అత్యవసర సమయాల్లో రెండున్నర శాతం అదనంగా వసూలు చేస్తున్నారు...తనిఖీలు చేయ వలసిన అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా తనిఖీ అధికారులు అన్ని బంకులలో తనిఖీలు నిర్వహించి అన్ని సౌకర్యాలు ఉన్నాయో లేవో పరిశీలించాలని, సిబ్బంది పని గంటలు తదితర విషయాల్లో తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎరువుల కేటాయింపులు పరిశీలన

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని సాతులూరు గ్రామంలో ఎరువుల రేకు పాయింటును సందర్శించి పల్నాడు జిల్లాకు సంబంధించిన కేటాయింపులను జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు శనివారం పరిశీలించారు. సిఐఎల్ యూరియా 1100 ఎంటిఎస్ పల్నాడు జిల్లాకి కేటాయించారని తెలిపారు. అవేజ్ గోడౌన్నును తనిఖీ చేశారు. ఆయన వెంట నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు మండల వ్యవ సాయాధికారి టి.శ్రీలత, వ్యవసాయ విస్తరణాధికారి జిపి శ్రీని వాసరావు, సాతులూరు గ్రామ వ్యవసాయ సహాయకులు రమేష్ ఉన్నారు.

ఎరువుల కేటాయింపులు పరిశీలిస్తున్న జగ్గారావు

కార్యక్రమంలో మాట్లాడుతున్న తోట ప్రభాకర్‌రావు

సురక్షితమైన తాగునీరు అందించండి

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ విశ్రాంత చీఫ్ ఇంజనీర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు తోట ప్రభాకర్‌రావు అన్నారు. విజయవాడలో ఆర్డబ్ల్యూఎస్ డీఈలకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం శనివారం మండలంలోని చిలువూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ పొందుతున్న వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామంలో రక్షిత నీటి సరఫరాను పరిశీలించి నీటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌ఓ వాటర్‌లో ఖనిజాలు ఉండవు అందువలన ప్రజలు త్వరగా కీళ్ల నొప్పుల బారినపడే అవకాశాలున్నాయనీ, రక్షిత నీటిలో ఖనిజాలు ఉంటాయన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని సిబ్బందిని కోరారు. అనంతరం గ్రామంలో అమలు జరుపుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో పారిశుధ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలనీ, మురికినీరు వ్యర్థ పదార్థాలు తొలగించడంలో ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిలువూరు మాణిక్యం ఈవో పీఆర్‌డి జవహర్లాల్ నెహ్రూ గ్రామ కార్యదర్శి ఎం.శరత్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వేణు టిడిపి నాయకులు తోటకూర సీతారామయ్య పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT ANAKAPALLE
I.A.110/2025 IN O.S.31/2019
Between:
Smt. Jagarapu Lalitha Kumari
...Petitioner
And:
Lalam China Kondayya (Died) & others
...Respondents
To
7 RESPONDENTS
Lalam Syamantha,
D/o late Gangadhararao, aged 32 years, Advocate - AP High Court, residing at 304, DNR Enclave, Mangalagiri Bypass, Mangalagiri, Guntur-522503.
NOTICE
పై నెంబరు I.A.ను 1వ రెస్పాండెంటు అయిన లాలం చినకొండయ్య గారి తరపు వారసులును చేర్చమని దాఖలు చేసియుంటిరి. కాగా పై నెంబరులో 7వ రెస్పాండెంట్ **2025దీకి** వాయిదా అయివున్నది. కావున మీరు సదరు తేదిన మీరుగాని మీ వకీలుగారి ద్వారాగాని పై కోర్టులో **ఉదయం గం. 10-30 నిలకు** హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలయపరచుకోవలెను లేనిచో మీపరోక్షమందు తీర్మనించడంమగునని ఇందుమూలంగ తెలయపరచడమైనది.
తే.13-9-2025దీ
అనకాపల్లి
లంకజగన్నాథం
లంకపార్వతీశ్వర్
అడ్వకేట్లు, అనకాపల్లి

లోక్అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - మాచర్ల

లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల కక్షీదారులు అంగీకారంతో సత్వర పరిష్కారం పొందవచ్చు అని మండల న్యాయ సేవాకమిటి చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ అన్నారు. మాచర్ల మండల న్యాయ సేవా కమిటి ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోరులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ తో 226 కేసులు పరిష్కారమయ్యాయి.క్రిమినల్ కేసులు 47, ఎన్ఐ యాక్టు కేసులు 9, భరణం కేసులు 4, ఎక్సైజ్ కేసులు 20, ఇపి కేసులు 22, సివిల్ దావాలు 9, ఎస్‌టియు 110, ఇతర కేసులు 5 మొత్తం 226 కేసులు పరిష్కరించబడ్డాయి. పరిష్కరించిన కేసుల విలువ రూ. 1,80,02,223లు. కార్యక్రమంలో మెట్టు గోవిందరెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జాతీయ లోక్అదాలత్‌ను నాలుగున్యాయస్థానాల్లో నిర్వహిం చారు. మూడు బెంచ్‌లుగా కేసులు పరిష్కరించారు. ఒక బెంచ్‌కి న్యాయమూర్తిగా సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), వి.విజయకుమార్ రెడ్డి,మెంబర్‌గా దివ్వెల శ్రీనివాసరావు వ్యవహరించారు. మరో బెంచ్‌కి న్యాయమూర్తిగా ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్‌డివిజన్) తౌషిద్ హుస్సేన్, మెంబర్‌గా న్యాయవాది సూరే వీరయ్య వ్యవహరించారు. మరో బెంచ్‌కి న్యాయమూర్తిగా రెండవఅదనపు సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) జె.సుజిన్ కుమార్, మెంబర్‌గా గుజ్జర్లపూడి సురేష్ వ్యవహరించారు. లోక్అదాలత్‌లో 500కేసులు పరిష్కరించారు, రూ.కోటి 81లక్షల 33వేల 487ల నగదు లావాదేవీలకు పరిష్కారం లభించిందని లోక్అదాలత్ మెంబర్ దివ్వెల శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు వివిధ, బ్యాంకుల మేనేజర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేంబ్రిడ్జి పాఠశాలపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలో గుర్తింపులేని కేంబ్రిడ్జి ఇంటర్నేషనల్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ అన్నారు. శనివారం పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి అనుమతి లేకుండా నర్సరీ నుంచి తొమ్మిదివ తరగతి వరకు కేంబ్రిడ్జ్ పాఠశాల వారు ప్రభుత్వ నిబంధనలు పాటించ కుండా జానపాడు రోడ్డులోని వాసవీ కమర్షియల్ కాంప్లెక్స్ లో ఇతర షాపుల మధ్యలో పాఠశాలను నిర్వహిస్తురని తెలి పారు. ఇంటర్నేషనల్ పాఠశాల పేరుతో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కేవలం ఇద్దరు టీచర్లతో పాఠ శాలను నడుపుతున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరారు. పాఠశాల ఆధ్వర్యంలో నడుపుతున్న బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలపై చర్యలు చేపట్టక పోతే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పిడుగు రాళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు రోహిత్, అలతఫ్, రామకృష్ణ, నాగూర్ పాల్గొన్నారు.

జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

అధికారుల తొలి సమావేశంలో నూతన కలెక్టర్ కృతికా శుక్లా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ కృతిక శుక్లా శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికా రులతో తొలి సమావేశం నిర్వహించారు. ఆమె జిల్లా పరిపా లనలో తీసుకోబోయే దిశ, రాష్ట్ర ప్రభుత్వం ప్రాధా న్యతా కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసు కోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ప్రజలకు ఎదు రవుతున్న సమస్యలు అర్థం చేసుకోవడంలో అధికారుల నుండి స్పష్టమైన వైఖరి అవసరమన్నారు. ప్రతి శాఖలో పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులు, దరఖాస్తులు, కేసులను సమగ్రంగా పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమస్య లకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఐవిఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణకు చెందిన అంశాల గురించి సంబంధిత అధికారులుమెరుగైన పనితీరు చూపాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, పేదల సంక్షేమ కార్యక్రమాలు జిల్లా స్థాయిలో సమర్థవంతంగా అమలవ్వాలన్నారు. పిజి ఆర్ఎస్‌కు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కతిక శుక్లా

సమస్యలు పరిష్కా రానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 15, 16 ముఖ్యమంత్రి కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లా సమస్యలు, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రావాల్సిన అనుమతులు, నిధులు మంజూ రు తదితర అంశాలపై శాఖల వారీగా చర్చించి సమగ్ర నివేదిక అందచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

గైర్హాజరైన వైద్యులపై చర్యలకు జీవీ సిఫార్సు

ఆకస్మిక తనిఖీల్లో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తీవ్ర ఆగ్రహం

ఆస్పత్రిలో సౌకర్యాలపై అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

ప్రభుత్వాస్పత్రిలో విధులకు డుమ్మా కొట్టిన ఇద్దరు వైద్యులపై తక్షణ చర్యలకు ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సిఫార్సు చేశారు. కేవలం హాజరు పట్టీలో సంతకాలు పెట్టాక విధులకు గైర్హాజరు అవుతున్న వారిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన ఏడాదిగా ప్రభుత్వాసు త్రుల్లో సౌకర్యాలు, వైద్యసేవల మెరుగుదలకు ఎన్నో చర్యలు తీసుకుంటున్నామని, ఆ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్న వారెవర్నీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శనివారం ఎమ్మెల్యే స్థానిక ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఓపీ నమోదు విభాగం, దస్త్రాలు పరిశీలించి సేవలపై అడిగి తెలుసుకున్నారు. జనరల్ వార్డురూమ్, ఎక్స్‌రే, ల్యాబ్, ఫార్మసీ కేంద్రాన్ని పరిశీ లించారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలిస్తున్న సమయంలో సంతకం చేసి అందుబాటులో లేకుండా పోయిన ఇద్దరు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చిన్నచిన్న వ్యాధుల నుంచి పెద్ద ఆపరేషన్ల వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయగల సామర్థ్యం పెరిగిందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రధానలక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, కొత్తగా వైద్యుల నియామ కాలు కూడా చేపట్టామన్నారు. ఆస్పత్రుల స్థాయిని బట్టి ఎక్కడికక్కడ కావాల్సినంత మేర ఔషధాల నిల్వలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. నిజాయితీగా పనిచేసే వైద్యులను ప్రభుత్వం ప్రశంసిస్తుందని, నిర్లక్ష్యం చూపే వారిపై మాత్రం కఠినచర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన వెల్లడించారు. పేదల కోసం నడుస్తున్న ప్రభుత్వ ఆస్పత్రులు ప్రేమతో, నిబద్ధతతో పనిచేసే వైద్యులు, సిబ్బందిని కావాలన్న జీవీ పనితీరులో లోపాలు ఉంటే మాత్రం సహించబోమని అన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

రాష్ట్రంలోని మూడున్నర లక్షల పెన్షనర్లందరూ ప్రభుత్వం ప్రకటించవలసిన పిఆర్సి కమిషన్, ఐఆర్, కరువు భత్యం గురించి ఎదురు చూస్తున్నారని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకష్ణారావు అన్నారు. శనివారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలు పూర్తి అయినా ఇంతవరకు ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, ట్రెజరర్ గాలిబ్, జాయింట్ సెక్రెటరీ గౌస్, సీని యర్ సభ్యులు అంజయ్య, రామారావు, నారాయణ, జాన్ సాహెబ్, మాబు, పాపిరెడ్డి, నాగేశ్వరరావు, నాగిరెడ్డి, కిరీటి రెడ్డి, భాస్కరబాబు, నాగార్జునరాజు, కృష్ణకుమారి, సుజాత, శివపార్వతి పాల్గొన్నారు.

రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి పిలుపు

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పల్నాడు భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. శనివారం కోటప్పకొండ రోడ్డులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిలార్ మసూద్ మాట్లాడుతూ ఏపి భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హక్కులు సాధనకు సోమవారం విజయ వాడ సీతారాంనగర్‌లోని రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాల యం ముట్టడికి భవన, ఇతర నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. గత ప్రభు త్వం 1214 మెమో జారీచేసిన ఫలితంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అన్ని రాష్ట్రాలలో వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఏపి లో అందుకు భిన్నంగా పరిస్థితి ఉందని కార్మికులకు ప్రమాదాలు జరిగినా ఆదుకునే పరిస్థితి లేదన్నారు. పిల్లల స్కాలర్షిప్పు, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, ఇన్సూరెన్స్ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక, హర్యానా తదితర రాష్ట్రాల లో వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. తమిళనాడులో ప్రమాదవశాత్తు చనిపోయిన భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి రూ 10 లక్షల పరిహారం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.ప్రసాదరావు, అధ్యక్షులు కె.ఆంజనేయులు, ఉపాధ్యక్షులు కె.సురేష్, ఆంజనేయులు, కొండలరావు, కోశాధికారి ఏ. ఆంజనేయులు, సహాయ కార్యదర్శి చిన్నఏసు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఇతరులు

అలరిస్తున్న బాలోత్సవాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంతరించిపోతున్న దేశ సంస్కృతి సాంప్రదాయాలు, కళలను ప్రోత్సహించడంతో పాటు చిన్నా, పెద్ద ప్రతి ఒక్కరిని అలరిస్తున్న పల్నాడు బాలోత్సవం పిల్లల పండుగ-3 విజయవంతం అయ్యేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావు పేట పట్టణం పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో శనివారం పల్నాడు బాలో త్సవం పిల్లల పండుగ-3, ఉపాధ్యాయ సాంస్కృతిక పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. చదువుల ఒత్తిడి నుంచి అందరికీ ఇది ఒక ఆటవిడుపు అని పేర్కొన్నారు. బాలోత్సవాల అధ్యక్ష కార్యదర్శిలు షేక్. మస్తాన్ షరీఫ్, కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్ఎస్ఎన్ కళాశాల క్రీడా ప్రాంగణంలో వచ్చే నెల 8,9 తేదీలలో ఉపాధ్యాయ సాంస్కృతిక పోటీలు, 29,30 తేదీలలో పల్నాడు బాలోత్సవం-3వ పిల్లల పండుగ జిల్లా స్థాయి అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామన్నారు. కృష్ణ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్య, వాగ్దేవి విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడారు.పల్నాడు బాలోత్సవం కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు ఎంఎన్ నూతన హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - కారంపూడి

మండలకేంద్రమైన కారంపూడిలో ఆదివారం ఎంఎన్ హాస్పిటల్ ప్రారం భిస్తున్నట్లు డాక్టర్ శంతన్ శనివారం తెలిపారు. పల్నాడు జిల్లా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించ నున్నామని తెలిపారు. సాధారణ చికిత్సలు, మహిళా వైద్యం, పిల్లల ఆరోగ్య పరీక్షలు, ప్రయోగశాల పరీక్షలు, ఎక్స్-రే, డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే చికిత్స అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఆసుపత్రి భవనం

సొసైటీ అధ్యక్షులుగా తుమ్మా జోజిరెడ్డి

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్)అధ్యక్షునిగా తుమ్మ జోజిరెడ్డి ని నియమిస్తూ పల్నాడు జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ కే. తిరుపతయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా గొట్టం లక్ష్మీ మల్లారెడ్డి (మిట్టగుడిపాడు) చేరెడ్డి రామలక్ష్మి (రెంటాల)ను నియమించారు వీరి పదవీకాలం రెండు సంవత్సరాలు. జోజిరెడ్డి నియామకం పట్ల పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

విజేతలకు నేడు అభినందన సభ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సౌత్ ఇండియా కరాటే పోటీలలో గోల్డ్ మెడల్, కాంస్య పథకాలను సాధించిన విజేతలకు ఆదివారం సాయంత్రం మూడు గంటలకు స్థానిక పాత బస్టాండ్ లోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అభినందన సభ జరుగుతుందని, ఈ సభకు పట్టణ ప్రజానీకమంతా పాల్గొని జయప్రదం చేయాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ముఖ్యఅతిథిగా డిఎస్‌పి ఎం హను మంతరావు, విశిష్ట అతిథిగా సీనియర్ కరాటే మాస్టర్ సన్ సాయి జీవీ నరసయ్య, ఆత్మీయ అతిథిగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, గౌరవ అతిథులు ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్ పసుపులేటి సురేష్, పల్నాడు విజ్ఞాన కేంద్రం నరసరావుపేట కన్వీనర్ అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి, సీనియర్ కరాటే మాస్టర్ సన్ సాయి అనుముల రాంబాబు, సన్మాన గ్రహీత బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్, అనుముల రామయ్య పాల్గొంటారని ఆయన తెలిపారు.

దోపిడీలేని సమాజ నిర్మాణానికి ఏచూరి కృషి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రజలందరూ సమానంగా బతకటానికి దోపిడీ లేని సమాజం కోసం కృషి చేయడమే సీతారాం ఏచూరికి అర్పించే నిజమైన నివాళని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ తెలిపారు. శుక్రవారం రాత్రి తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్ సిపిఎం కార్యాలయంలో ఏచూరి ప్రథమ వర్ధంతి సభ జరిగింది. సభకు సిపిఎం నాయకులు వేముల దుర్గారావు అధ్యక్షత వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గాదె సుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ మాట్లాడుతూ సమాజం కొద్దిమందిని మాత్రమే గుర్తుపెట్టుకుంటుందని, అటువంటి వారిలో ప్రజల కోసం పనిచేసిన సీతారాం ఏచూరి ముందు వరుసలో ఉంటారని చెప్పారు. దేశ రాజకీయాలను దశ దిశ నిర్దేశించి ఏచూరి అని కొనియాడారు. మతోన్మాద రాజకీయాలను నిలువరించడంలో అగ్రగన్యుడు, మేధావి, వర్గ సిద్ధాంతం కోసం తుడిదాకా పని చేసిన ఏచూరి లేని లోటు తీర్చలేనిదని చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిజం ప్రత్యామాయం అని తేల్చి చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజల సమస్యలు పరిష్కరించబడవు అనేదానికి నిదర్శనంగా దేశంలో మోడీ, రాష్ట్రంలోకూటమి పాలన కొనసాగుతుందని వివరించారు. ప్రజలందరూ సుఖంగా ఉండాలంటే సోషలిజం తప్ప మరో మార్గం లేదని తెలిపారు. రాజధాని, కరేడు ప్రాంతాల్లో బలవంత భూసేకరణ ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, ఎ.శివభర్తలం పాల్గొన్నారు.

ఏచూరి సంతాపసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, ఉండవల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తూరులో..

కొత్తూరులో శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాస్ కుమారి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, బి.దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శం

పూర్వ సిపిఎం అఖిలభారత కార్యదర్శి సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డ్ బాధ్యులు ఓలేటి శాంతి శ్రీ అన్నారు. ఉండవల్లిలో డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏచూరి వర్ధంతి సభ జరిగింది. వీరనారి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు రజక వృత్తిదారుల సంఘం నాయకులు ఈమని రామారావు, బి.సుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవి, శాంతి శ్రీలు మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా సీతారాం ఏచూరి రాజీలేని పోరాటం చేశారని తెలిపారు. వామపక్ష , ప్రజాతంత్ర శక్తులను ఏకం చేసేందుకు ఏచూరి నిరంతరం కృషి చేశారని అన్నారు. ఏచూరి లేని లోటు ప్రజాతంత్ర శక్తులకు, పీడిత ప్రజలకు తీరనిలోటని అన్నారు. తెలంగాణలో భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు, జమీందారుల అరాచకాలకు వ్యతిరేకంగా తుపాకీ పట్టి పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ పేదలకు భూములు పంపిణీ చేయించారని అన్నారు. బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో తుపాకీ గుళ్ళకు బలైన సత్తెనపల్లి రామకృష్ణ ఆశయస్ఫూర్తితో నేడు పాలకులు ప్రజలపై వేస్తున్న విద్యుత్ బారాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. సభలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు బొజ్జ సుబ్బారావు, సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు టి.బక్కిరెడ్డి, కె.జగదీశ్వర్‌రెడ్డి, ఉండవల్లి పార్థసారధి, తుమ్మపూడి శివయ్య, పి.గాంధీ, ప్రజాశక్తి బాధ్యులు ఓలేటి శ్రీనివాసరావు, ఎం.రమేష్‌కుమార్, ఓలేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన మురుగునీరు

మురుగుపోయే దారేదీ..?

ప్రజాశక్తి- తాడేపల్లి

అభివృద్ధి చెందుతున్న తాడేపల్లి బైపాస్ రోడ్డు ప్రాంతంలో మురుగు నీరు పోయే దారి లేక దుర్గంధం వెదజల్లుతోంది. ఈ ప్రాంతంలో అనేక వ్యాపార సంస్థలు ఎక్కడ తమ లావాదేవీలు కొనసాగిస్తున్నాయి. నిత్యం వందలాదిమంది ఈ ప్రాంతానికి వచ్చి పోతూ ఉంటారు. జాతీయ రహదారి పక్కన ఇరువైపులా సర్వీస్ రోడ్డులో మురుగు పోవటానికి కాలువలు అయితే ఏర్పాటు చేశారు కానీ మురుగు పోయే దారి మాత్రం ఇంజనీరింగ్ అధికారులు చూపించలేకపోయారు. ఫలితంగా మురుగు పెద్ద ఎత్తున నిలబడి, దుర్వాసన వెదజల్లుతుంది. షాపులకు కొనుగోలుకు వచ్చే వారికి తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. రోగాలబారిన పడే ప్రమాదం ఉంది.

మురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

తాడేపల్లి బైపాస్ రోడ్‌లో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్‌లో మురుగు సమస్య వెంటనే ఎంటిఎంసి అధికారులు పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు దొంతి రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, వై.భర్నబాస్ కోరారు. అధికారులు అలసత్వం వహిస్తే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు.

మాట్లాడుతున్న నాయకులు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు తిరిగి ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని, ఈ నెల 15వ తేదీన విజయవాడలోని లేబర్ కార్యాలయానికి భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు వేముల దుర్గారావు కోరారు. శనివారం ఉండవల్లి సెంటర్లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల్లో భవననిర్మాణ కార్మికుల కరపత్రాలు పంపిణీ చేస్తూ, గ్రూపు సమావేశం నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పటికీ భవన్ నిర్మాణ కార్మికుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాష్‌నగర్, మహానాడు, సుందరయ్య నగర్, తాడేపల్లి, నులకపేట తదితర ప్రాంతాల్లో భవననిర్మాణ కార్మిక సంఘం కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నారిన నాగేశ్వరరావు, తాడేపల్లి నాయకులు కోట బాబురావు, వి.శాస్త్రి, ప్రభాకర్, ఖాజావలి, భుజంగరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం

మాట్లాడుతున్న ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని, మన గళం వినిపించినప్పుడే కనీస వేతనం సాధించుకోగలమని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంతగాని ధనలక్ష్మి అన్నారు. శనివారం ప్రత్తిపాడు మండల ఆశవర్కర్స్ సమావేశం సిఐటియు మండల అధ్యక్షులు కొండేపాటి సరోజిని అధ్యక్షతన జరిగింది. వైజాగ్‌లో జరిగే సిఐటియు జాతీయ మహాసభలు నిమిత్తం స్వచ్ఛంద విరాళాలకై కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనారోగ్యంతో మృతి చెందిన చేబ్రోలు గ్రామ ఆశా వర్కర్ ఇంటూరి సులోచన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి సభ్యులంతా మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ధనలక్ష్మి మాట్లాడుతూ నిరంతరం ప్రజా క్షేత్రంలో సేవలందించే ఆశా వర్కర్స్‌కు అనారోగ్యం వచ్చినప్పుడు కనీసం సెలవులు కూడా లభించటం లేదని, ఆశా కార్యకర్తలకు వారాంతపు సెలవులు, మెడికల్ లీవులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు మండల సమన్వయ కమిటీ అధ్యక్షురాలు కాకర్లమూడి జ్యోతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, మహాలక్ష్మి, సిరాజ్, షకీలా, నిరోష, తిరుపతమ్మ, బాలాంకమ్మ, రూతు రాణి, యేసు మరియమ్మ, సరిత, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా చిరంజీవి

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంగళగిరికి చెందిన కనికళ్ళ చిరంజీవిని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులను జారీ చేసింది.

మాట్లాడుతున్న పల్లె కృష్ణ

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్ట ప్రకారం 26వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గుండిమెడ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కార్మికులకు వచ్చే జీతాలు చాలక, పెరిగిన నిత్యావసర సరుకులు కొనలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఆప్కాస్‌లో చేర్చని పారిశుద్ధ్య కార్మికులను వెంటనే ఆప్కాస్ లో చేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల జీతాలను పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ పథకాలను ఆంక్షలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపచేయాలని కోరారు. అనంతరం గుండిమెడ పారిశుధ్య గ్రామ కమిటీని ఎన్ను కున్నారు. అధ్యక్షులుగా నూతక్కి మహేష్, కార్యదర్శిగా మొండ్రు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఉషారాణి, సహాయ కార్యదర్శిగా ఏబేద్, కోశాధికారిగా దావులూరి దినేష్ ఎన్నికయ్యారు.

పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్, శిబిరంలో పాల్గొన్న ప్రజలు, నాయకులు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలం లోని కాజ గ్రామంలో సుందరయ్య భవన్ నందు నిమ్మగడ్డ రామ్మోహన్ రావు విజ్ఞాన కేంద్రం, సింహాద్రి శివారెడ్డి బసవ పున్నయ్యల మెమోరియల్ ట్రస్ట్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిరవించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 153మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 43మంది శుక్లాల ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి మరియు జిల్లా అందత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. వివిధ గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరానికి హాజరైనట్లు చెప్పారు. సింహాద్రి శివారెడ్డి, బసవ పున్నయ్యల మెమోరియల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో చినకాకాని హైస్కూల్ అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని చెప్పారు. స్కూల్లో బోరు వేయించడం, సీసీ కెమెరాలు ఏర్పాటు, కంప్యూటర్ ల్యాబ్‌లో కంప్యూటర్లు బహూకరణ, ప్రతి సంవత్సరం విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తూ విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. కాజ గ్రామంలో శ్మశాన అభివృద్ధికి కోసం, మహా ప్రస్థానం వాహనం ఏర్పాటు చేసి సేవలు అందిస్తుందని, డెంగ్యూ మరియు ఇతర జ్వరాలకు హోమియోపతి మందులను పంపిణీ చేస్తూ సేవలందిస్తున్నారనీ తెలిపారు. ఈ సేవా కేంద్రాన్ని నిమ్మగడ్డ విజ్ఞాన కేంద్రం మరియు సింహాద్రి శివారెడ్డి బసవ పున్నయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెగా వైద్య శిబిరంలో ఈమని అప్పారావు, వుద్దంటి దుర్గారావు, సింహాద్రి సుమ, గడ్డం అజయ్ కుమార్, సింహాద్రి ఆదిశేఖర్ రెడ్డి, కాజా శివశంకరావు, భీమిరెడ్డి సత్యమారెడ్డి, బ్రహ్మయ్య, గాదె మాధవరెడ్డి, గాదె గోపాలరెడ్డి, చిట్టేల సీతారామాంజనేయులు, పి.సుగుణ కుమార్, మైలా శంకర్రావు పాల్గొన్నారు.



ఎత్తిపోతలను సందర్శించిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ఎత్తిపోతలను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - విపిసౌత్

ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతల జలపాతాన్ని మాచం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల ఎత్తిపోతలకు నీరు అధికంగా వస్తోందని, కొండలపై నుంచి పడుతున్న నీరు పర్యాటకులను ఆకర్షిస్తోందని తెలిపారు. ఎత్తిపోతలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

నాగార్జున సాగర్ నుండి దిగువకు వదిన కృష్ణాజలాలు, పులిచింతల వద్ద నీటి ప్రవాహం

సాగర్ జలాశయానికి భారీగా వరద

- 26 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటివిడుదల
- జలాశయానికి 2,81,352 క్యూసెక్కుల ఇన్ ఫ్లో
- 589.70 అడుగులకు చేరిన నీటి మట్టం
- సాగర్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - విపిసౌత్

నాగార్జునసాగర్ డ్యామ్ జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాజెక్టులన్ని నిండుకుండలా మారి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తుండటంతో నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చిచేరుతుంది. ఎగువ శ్రీశైలం జలాశయం 7 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,93,634 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 66,280 క్యూసెక్కుల నీటిని మొత్తం 2,81,352 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జున సాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నారు. దీనితో శనివారం సాయంత్రానికి నాగార్జునసాగర్ డ్యామ్ 26 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,09,794 క్యూస్సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు గాను ప్రస్తుతం 589.70 అడుగులవద్ద నీరు నిల్వవుంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 311.1486 టీఎంసీల నీరు నిల్వ ఉంది.ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 32,764 క్యూసెక్కుల నీటిని,కుడి కాలువ ద్వారా 9019 క్యూసెక్కుల నీటిని,ఎడమ కాల్వద్వారా 6325 క్యూసెక్కుల నీటిని,ఎస్.ఎల్.బి.సి ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని,లోలేవల్ కెనాల్ ద్వారా 300క్యూసెక్కుల నీటిని మొత్తం 2,60,602 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సాగర్‌కు పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ అందాలను చూసేందుకు పర్యాటకులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీగా తరలి వచ్చారు. సాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు చూసి పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పర్యాటక ప్రాంతాలైన అనుపు, బుద్ధ వనం, కొత్త వంతెన, పాత వంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది.

టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు శనివారం మధ్యాహ్నం నుంచి భారీగా వరద నీరు రావడంతో 18 రేడియల్ క్రస్ట్ గేట్లు ద్వారా 3,06,500 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఇ వెంకటరమణ తెలిపారు. 10 గేట్లను 4 మీటర్లు, 8 గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తేమన్నారు శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా1.0155 ఎంయుల విద్యుత్తు తయారైంది అన్నారు శనివారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుంచి 3,10,000 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు రిజర్వాయర్లో 74.45 మీటర్ల మేరు నీరు ఉండగా ఈ నీరు 6.376 టీఎంసీలకు సమానం.

ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉద్యోగ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ తలపెట్టిన "నిరసన వారం" మూడవరోజు ప్రజా ప్రతి నిధులకు ప్రాతినిధ్యంలో భాగంగా సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ కలిసి సమస్యలపై చర్చించి శనివారం వినతి పత్రం అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా తనవంతు కషి చేస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఏపీటీఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖలీద్, పల్నాడు జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ ఉస్మాన్, రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి గుడిపాటి దాసు, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు బాళ్ల శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం, రాజుపాలెం అధ్యక్షులు అద్దంకి శ్రీధర్, సత్తెనపల్లి ప్రధాన కార్యదర్శి కాల్వపల్లి శివారెడ్డి, కొల్లూరు ప్రధాన కార్యదర్శి జి.మాలకొండయ్య పాల్గొన్నారు.

బోరు పంపును ప్రారంభిస్తున్న వెన్నా సీతా రామరెడ్డి

ఉచిత బోరు పంపు ప్రారంభం

ప్రజాశక్తి - బెల్లంకొండ

బోరు పంపులేకపోవడంతో మంచినీటి కోసం ఇబ్బం దులు పడుతున్నామని కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతా రామరెడ్డి దృష్టికి నాగిరెడ్డిపాలెం గ్రామం ఎస్టీ కాలనీ తీసుకెళ్లారు. ఆయన స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత సిల్వర్ మోజేష్‌కు తెలియజేశారు. స్పందించిన మోజెస్ కాలనీ వాసులకు ఉచితంగా బోరు పంపు వేయించారు. శనివారం ఉదయం వెన్నా సీతారామరెడ్డి ఆధ్వర్యంలో బోరు పంపు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన సిల్వర్ మోజేష్ మాట్లాడుతూ నీటి కోసం మహిళలు పడిన కష్టాలను గుర్తించి వారికి తాగునీరు అందించాలనే సంక ల్పంతో బోరు పంపు వేయించామన్నారు. కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామరెడ్డి మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్నారు. మోజేష్‌కు కాలనీవాసుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు బద్దూరి వీరా ెడ్డి, బద్దూరి సుబ్బారెడ్డి, మాజీ ప్రెసిడెంట్ బద్దూరి వెంకటరెడ్డి, బద్దురి రామిరెడ్డి, జోసెఫ్, నరసింహారావు, గోవింద రెడ్డి పాల్గొన్నారు

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి

ప్రజాశక్తి-గుంటూరు

తురకపాలెంలో శనివారం బిసివైపార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ మృతుల కుటుంబాలను పరామర్శిం చారు. వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తన వంతుగా రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. తురక పాలెంలో ఇటీవల సంభవిస్తున్న మరణాలు ఆందోళన కలిగి స్తున్నాయని నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి కారణాలు అన్వే షించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయిం ంచాలని కోరారు.

మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - వినుకొండ

మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ ఇంచార్జ్ జడ్జి ఆర్.ఆశీర్వాదంపాల్ శని వారం జాతీయ మెగాలోక్ అదాలత్‌ను వినుకొండ కోర్టులో నిర్వహించినారు. ఈ లోక్అదాలత్‌లో రాజీపడిన ప్రామి సరీనోట్, చెక్‌బౌన్స్, మనోవర్తి, బార్య భర్త తగాదాలు, గృహ హింస, తగాదాలు, ప్రైవేట్ కంప్లైంట్స్, ప్రిలిటిగేషన్ కేసు లు, ఎక్సైజ్ కేసులు, పెట్టి కేసులు, ఇతర కేసులు ఈ లోక్ అదాలత్‌లో రాజీ చేశారు. జడ్జి మాట్లాడుతూ లోక్అదా లత్‌ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు, చట్టాల గురిం చీ అవగాహన కలిగి వుండాలి అని, చిన్నచిన్న తగాదా లకు పోలీస్ స్టేషన్‌లా చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగి తమ విలువైన సమయాన్ని కోల్పోవద్దు అని, రాజీమార్గమే రాజ మార్గం అని తెలిపారు. సమస్యలను సామరస్యంగా రాజీ పద్ధతులలో పరిష్కరించుకోవాలి అని, వివాదాలకు దూరంగా ఉండాలి అని, చట్టల పట్లా అవగాహన కలిగి ఉం డాలి అని తెలియ జేసినారు. మొత్తం సుమారు 372 రాజీపడిన సివిల్, క్రిమినల్, పిల్‌సీ, చెక్‌బౌన్స్, మెయిన్ల నెన్స్, పెట్టి కేసులు, ఎస్‌టిసి కేసులు ఈ మెగాలోక్ అదాలత్‌లో పరిష్కరించి రూ.90 వేలను కక్షిదారులకు ఇప్పిస్తారన్నారు. అని న్యాయ మూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్ తెలియ చేశారు. లోక్అదాలత్ మెంబర్ పఠాన్‌గౌస్ మొహి ద్దీన్ ఖాన్, సీనియర్ జూనియర్ న్యాయావాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, లోక్అదాలత్ సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమం నిర్వించారు.

మెగా లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి ఆశీర్వాదంపాల్

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాచర్ల నందు కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్, పొలిటికల్ సైన్స్ పోస్టులకు అతిధి అధ్యాపకుల నియామ కానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీ కుమారి తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్య ర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 15 సోమవారం నిర్వహించే వాకిన్ ఇంటర్వ్యూ లకు హాజరు కావలసిందిగా కోరారు. సంబంధిత సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పిజి) 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఎన్ఇటి, ఎస్ఇటి, పిహెచ్‌డి వారికి ప్రాధాన్యత ఉంటుం దని ప్రిన్సిపాల్ లక్ష్మీ కుమారి పేర్కొన్నారు.

జున్ను సాహెబ్‌ను సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు

చేతిరాత శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లింగారావుపాలెంలో శనివారం విద్యార్థులకు చేతి రాత శిక్షణా శిబిరం నిర్వహిం చారు. చేతిరాత నిపుణులైన ఉపాధ్యాయులు జున్ను సాహెబ్ విద్యార్థులకు మెళకువలు నేర్పించారు. చక్కని చేతి రాత విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందని పాఠ శాల ప్రధానోపాధ్యాయులు కేవీ రామిరెడ్డి తెలియ జేశారు. ఉపాధ్యాయుడు జున్ను సాహెబ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయ బృందం సత్కరించారు. కార్యక్రమం లో పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ షేక్ జాన్ సైదులు, గ్రామపెద్దలు నంబూరు శివరామకృష్ణ, తోకల సత్యనారా యణ, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, డి సుధాకర్‌రావు, టి.విజయ శామ్యూల్, యు.మల్లేశ్వరి పాల్గొన్నారు.

పేదవారికి ఒక్క పూటైనా భోజనం పెడదాం

ప్రజాశక్తి- పెదకూరపాడు

ఆకలితో ఉన్న ప్రతి పేద వాడికి ఒక పూటైన భోజనం పెడదామని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబ శివ రావు అన్నారు. నియోజక వర్గ కేంద్రమైన పెదకూరపాడులోని పట్టాభి రామ చంద్రస్వామి దేవాలయం నిర్మాణం చేపట్టి వందేళ్లు పూర్తి అయిన సంద ర్భంగా శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో 300 మందికి పైగా భోజనాలు మిగిలిపోయాయి. ఆలయ కమిటీ ప్రతినిధి కొర్లకుంట శ్రీని వాసరావు జన చైతన్య సమితి ప్రతినిధులకు చరవాణి ద్వారా సమాచారం ఇచ్చా రు. వారు టాటా ఏసీ వాహనంలో ఆహారాన్ని సేకరించి గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాల వద్ద, మార్కెట్ సెంటరు, పెదకాకాని సమీపంలోని పుచ్చల పల్లి సుందరయ్య కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి నుండి శనివారం తెల్లవారు జామున నాలుగున్నర గంటల వరకు పంపిణీ చేశారు. సాంబశివరావు మాట్లా డుతూ మిగిలిన ఆహారాన్ని వృథా చేయకూడదనే లక్ష్యంతో నిద్రా హారా లు మానుకుని పంచి పెట్టా మన్నా రు. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు మాట్లా డుతూ లక్షలాది మంది ఆహారం లేక ఆకలితో అలమటిస్తున్నారని ఏ ఫంక్షన్లోనైనా ఆహారం మిగిలితే మాకు సమాచారం ఇస్తే పేదలకు పెడతామని అన్నారు. కొర్లకుంట బ్రహ్మం బెజ్జం నాగేశ్వరరావు, కె.కోటే శ్వరరావు, కె.పరమేశ్వరరావు ఉన్నారు. ఫంక్షన్లలో భోజనాలు మిగిలితే ఫోన్ నంబర్లు 8886777767, 9885557987, 9848977677లలో సంప్రదించాలని జనచైతన్యసమితి ప్రతినిధులు కోరారు.

భోజనం వడ్డిస్తున్న జనచైతన్య సమితి సభ్యులు

స్మార్ట్ రేషన్ కార్డుకు ఎన్ని తిప్పలో...

ప్రజాశక్తి - మంగళగిరి

స్మార్ట్ రేషన్ కార్డులు కోసం మంగళగిరి పట్టణంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్డులు పేరుతో ఈ నెలలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేయడానికి చర్యలు చేపట్టింది. మంగళగిరి పట్టణంలో కూటమి నాయకులు హడావుడిగా ఆయా ప్రాంతాల్లో పంపిణీ చేసి ఫొటోలు ఇచ్చారు. ఇంటికి తీసుకొచ్చి ఇస్తారని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు విరుద్ధంగా సచివాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంతో స్మార్ట్ రేషన్ కార్డు కోసం నానా తిప్పలు పడుతున్నారు. దీంతో కార్డుదారులు సచివాల యాల చుట్టూ తిరుగుతున్నారు. సచివాలయాలు సిబ్బంది రేషన్ డీలర్లు సహకరించడం లేదని వాపోతున్నారు. కార్డుదారుల ఇబ్బందులను గుర్తించి, సంబంధిత అధికారులు స్మార్ట్ రేషన్ కార్డులను సక్రమంగా కార్డుదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఇచ్చిన కొంతమంది స్మార్ట్ కార్డుల్లో తప్పులు తడకలుగా ఉన్నాయని వాపోతు న్నారు. ఇవి సరి చేసుకోవాల్సిన పరిస్థితి కూడా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో స్మార్ట్ కార్డులను సక్రమంగా పంపిణీ చేసి, తప్పులు ఉంటే మరలా సరి చేయాల్సిన అవసరం ఉందని, అధికారులు ఇందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

రాజీవ్ గాంధీ సెంటర్‌లోని సచివాలయం వద్ద ఉన్న కార్డుదారులు

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

284వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావాల్సిన బకాయిల కోసం ఎపిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 284వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వి.దుర్గారావు, కార్మికులు సిహెచ్.పిచ్చయ్య, షేక్ సుభాని, వై.సాంబశివరావు, సూర్యప్రకాష్, బి.అంకయ్య ప్రారంభించారు. దీక్షలలో మహిళలు షేక్ ఇమాంబి, వై.రమాదేవి, ఈదులమూడి శారమ్మ, దర్శి బేబమ్మ, వేము రిబ్కా కూర్చున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన నష్టపరిహారం అందే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యహోషువ, సందం దేవరాజు, తుపాకుల నాగేశ్వరావు, ఎం శివకుమారి, కొండా, రావూరి ఇశ్రాయిల్ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సిఆర్‌ఎఫ్ సభ్యులు

బాల్య వివాహాలకు ముగింపు పలుకుదాం

ప్రజాశక్తి - తెనాలి

బాల్య వివాహాలకు ముగింపు పలుకుదామని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ షేక్ పర్వీన్ సుల్తానా అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ (సిఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైకుంఠపురం దేవస్థాన ప్రాంగణంలో 'ఎండ్ చైల్డ్ మ్యారేజ్' అనే నినాదంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానా మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీ పురుషులకు వివాహ వయసు నిర్ణయించిందని, మహిళలకు 18, పురుషులకు 21 సంవత్సరాల వయస్సు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలతో అనేక అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని వివరించారు. ప్రజలంతా అవగాహన కలిగి ఉంటే బాల్య వివాహాలను అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో వైకుంఠపురం ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనుపమ, వార్డ్ ఏఎన్‌ఎం, అంగన్వాడీ టీచర్లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితునికి సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. వైద్య నిమిత్తం సీఎం సహాయ నిధికి అర్జీ పెట్టుకోగా స్పందించిన ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాగరాజుకు 75వేల 27 రూపాయల సీఎం సహాయనిధి చెక్ ను సాంక్షన్ చేశారు. శనివారం వడ్డేశ్వరం గ్రామ టిడిపి నాయకులు నాగరాజు ఇంటి వద్దకు వెళ్లి సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు నాగరాజు మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, గ్రామ తెలుగుదేశం నాయకులకు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు షేక్ నాగూర్ వలి, షేక్ ఇమాంన, కంచర్ల కోటేశ్వరరావు, లటికే శివ, అబ్దుల్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని షరాబజార్‌లో స్వర్ణకారుల సమావేశం శనివారం జరిగింది. స్వర్ణకార పెద్దలు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ సమావేశంలో సంఘానికి కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా గొట్టుముక్కల నాగరాజును, కార్యదర్శిగా బట్టు నారాయణను, ట్రెజరర్‌గా జొన్నాదుల బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కమిటీ బాధ్యతలు స్వీకరించడంతో స్వర్ణకార వర్గంలో ఆనందం నెలకొంది. సమావేశంలో మాట్లాడిన పెద్దలు, సంఘ ప్రతినిధులు స్వర్ణకారుల ఐక్యత, అభివృద్ధి కోసం కృషి చేయాలని కొత్త కమిటీకి సూచించారు. మంగళగిరి శాసన సభ్యులు, మంత్రి నారా లోకేష్ సహకారంతో స్వర్ణకార లకు పలు సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని వారు గుర్తుచేశారు. ముఖ్యంగా, మంగళగిరిలో స్వర్ణకారుల కోసం ప్రత్యేకంగా "గోల్డ్ హబ్" నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నూతన కమిటీకి హాజరైన సభ్యులు అభినందనలు తెలుపుతూ, స్వర్ణకార వర్గ ఐక్యతతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను సాధించాలని ఆకాంక్షించారు.

నూతన కార్యవర్గం

వర్క్‌షాపులో మాట్లాడుతున్న విద్యార్థినులు

ఆర్‌విఐటిలో ఒకరోజు వర్క్‌షాప్

ప్రజాశక్తి - చేబ్రోలు

ఉత్పాదక కృత్రిమ మేధస్సు, దాని ప్రాయోగిక వినియోగాలు అనే అంశంపై స్థానిక ఆర్‌విఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఆర్‌విఐటి కళాశాల, నెక్స్ హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా వర్క్‌షాపు ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వి.కఅష్ణయ్య తెలిపారు. బి.టెక్, ఎంసిఎ చదువుతున్న బాల, బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుత సమాజంలో జనరేటివ్ ఎఐ యొక్క ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకొని మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. వాస్తవ ప్రపంచంలో దీనిని ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. జనరేటివ్ ఎఐ నూతన ఆవిష్కరణల కోసం విస్తృత అవకాశాలను అందించడంతో పాటు, విద్యార్థుల నైపుణ్యాలను పెంచుతుందన్నారు. అలానే ప్రముఖ టెక్నాలజీ కంపెనీలలో ఉద్యోగావకాశాలను పెంచుతుంది అని పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌లు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందుకోసం 41 బెంచీలను ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణచక్రవర్తి తెలిపారు. జిల్లా కోర్ట్ ప్రాంగణంలో 16 బెంచీలను అలాగే 12 మండల కేంద్రాలలో 25 బెంచీలను ఏర్పాటు చేశారు. శనివారం లోక్ అదాలత్‌లో 2020 నెల్లూరు జిల్లా, కావూరు గ్రామం వద్ద జరిగిన ప్రమాదంలో మరణించిన యార్లగడ్డ శ్రీనివాసులు కేసుకు సంబంధించిన క్లైయిమ్‌లో ఆయన కుటుంబానికి యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సు కంపెనీ రూ.1,11,82,343లు చెక్కును అందచేసింది. గతంలో బాధితులు రూ.85 లక్షలు క్లైయిమ్ చేయగా ట్రయిల్ కోర్టు రూ. 82,49,202లు, 6 శాతం వడ్డీ ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. దీంతో ఇన్సూరెన్సు కంపెనీ హైకోర్ట్‌లో అప్పీల్ వేయగా ఆంధ్ర ప్రదేశ్ హైకోర్ట్ పరిహారాన్ని రూ.91,74,094లుగా, వడ్డీ 9 శాతం పెంచగా బాధితులు గుంటూరులోని మొదటి అదనపు జిల్లా కోర్టులో ఎగ్జిక్యూషన్ పిటిషన్ దాఖలు చేశారు. లోక్ అదాలత్ చేసిన సయోధ్య ప్రయత్నాలు విజయవంతమై రూ.1.11 కోట్లకు పైగా ఎక్స్‌గ్రేషియా అందుకున్నారు. ఈ మొత్తాన్ని బాధితుల తరపున న్యాయవాది వి.బ్రహ్మ రెడ్డి, ఇన్సూరెన్సు కంపెనీ తరపు న్యాయవాది పి. రామాంజనేయులు, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సు కంపెనీ మేనేజర్ సమక్షంలో బాధితులకు జిల్లా జడ్జి సాయి కల్యాణ చక్రవర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు, సివిల్ జడ్జిలు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా సివిల్ కేసులు 918, క్రిమినల్ 10,855, పిఎల్‌సిలు 36 మొత్తం 11,809 కేసులు పరిష్కారం అయినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ తెలిపారు. సివిల్ కేసులు అత్యధికంగా పరిష్కరించి, గుంటూరు రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

బాధితులకు చెక్కు అందజేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. కళ్యాణచక్రవర్తి

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - పెదకాకాని

మండలం పరిధిలోని నంబూరు గ్రామం అంబేద్కర్ నగర్ కు చెందిన ఇద్దరు మహిళలు శనివారం మధ్యాహ్నం పిడుగుపాటుకు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలు అయినాయి వారిని గుంటూరు జిజిహెచ్‌కి తరలించారు. పిడుగుపాటుకు నంబూరు అంబేద్కర్ నగర్‌కి చెందిన వ్యవసాయ కూలీలు మరణించిన దాసరి రాణి, దాసరి శారమ్మ కుటుంబాలను సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, సిపిఎం పెదకాకాని శాఖ కార్యదర్శి బి.బాబురావు, నంబూరు సిపిఎం శాఖ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కె.ఆదం మృతుల కుటుంబాలను పరామర్శించి చనిపోయిన వారికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పిడుగుపాటుకు మరణించిన కుటుంబాలను అదేవిధంగా ఆలి రఫత్ నగర్‌కి చెందిన ఎర్ర మోతు మరియమ్మ, పాముల మణికుమారి, అంబేద్కర్ నగర్‌కు చెందిన దాసరి ప్రభావతి కుటుంబాలను ఆదుకోవాలని, గాయాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

బాలల పార్లమెంటులో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనేందుకు బాలల పార్లమెంటు దోహదం

ప్రజాశక్తి - తుళ్లూరు

బాలల పార్లమెంట్ పిల్లలకు ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనేందుకు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి, వారి సమస్యలను వ్యక్తం చేయడానికి ఒక వేదికని గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ సిస్టర్ విద్య అన్నారు. మండలంలోని వడ్డమాను గ్రామంలో శనివారం గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాలల పార్లమెంట్ నిర్వహించారు. బాల బాలికలు చిన్ననాటి నుండి నాయకత్వ లక్షణాలు అలవర్చు కొని సమాజంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను సూచించేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఆశా కార్యకర్త పాములపాటి లక్ష్మీ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో బాల బాలికలు, గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంధ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కళాశాల అభివృద్ధికి కృషి : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మహిళా కళాశాలను ఎమ్మెల్యే నశీర్‌తో కలిసి శనివారం ఆయన సందర్శించారు. కళాశాలకు సి ఎస్ఆర్ నిధులతో రూ.2.50 కోట్ల వ్యయంతో నూతన భవనాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. కళాశాలలో ప్రస్తుతం సీనియర్ లెక్చరర్‌లు ఉన్నాయని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2,500 మంది విద్యార్థులు చదువుతున్న ఈ కాలేజీలో 26 కోర్సులు ఉన్నాయన్నారు. అయితే అందుబాటులో ఉన్న క్లాసులే కాకుండా మొత్తం కలిపి 45 క్లాస్ రూములు ఇంకా అవసరం ఉన్నాయని, 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు నిర్మించేందుకు కోల్ ఇండియా సంస్థ వారి సహకారంతో చేపట్టనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ మాట్లాడుతూ దాదాపు వంద సంవత్సరాల చరిత్ర గలిగిన కళాశాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, కాలేజ్ ప్రిన్సిపల్ జ్యోత్స్న, కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఎపిజిఇఎ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక అంకమ్మ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యాలయాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సూర్యనారాయణ మాట్లాడుతూ క్రింది స్థాయి ఉద్యోగుల నుంచి రాష్ట్ర స్థాయి ఉద్యోగులు ఉండే ఏకైక గుర్తింపు పొందిన సంఘం ఎపిజిఇఎ అని, ఇప్పటివరకు సంఘం కార్యాలయం లేనందున సీఎం కార్యాలయ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ తాత్కాలిక భవనాన్ని కేటాయించారన్నారు. జిల్లా కలెక్టర్, డిఆర్ఒ, ఇతర అధికారులకు జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి కె.వి.ఎస్.శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి సుమిత్రా దేవి, పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై తొలగని నిర్లక్ష్యం

7 వీక్షణం

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో గత రెండు నెలలుగా సంభవిస్తున్న అసాధారణ మరణాలకు ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల స్వార్ధం ఉన్నట్టు స్పష్టం అవుతోంది. జులై, ఆగస్టు, సెప్టెంబరు 2 వరకు 22 మంది మృతి చెందిన ఘటనలో గత రెండు వారాలుగా అధికారులు నిర్వహిస్తున్న అనేక అధ్యయనాల్లో స్పష్టమైన కారణాలు వెలుగుచూడలేదు. అసాధారణ మరణాలపై అధికారుల అధ్యయనం ఇంకా కొనసాగుతోంది. గుంటూరుకు కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామంలో పరిస్థితులపై దాదాపు రెండు నెలల పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మిన్నకుండిపోయారు. గత ఐదు నెలలుగా ఈ గ్రామంలో దాదాపు 29 మంది వరకు మృతి చెందారు. ఈ అంశంపై ఆగస్టు చివరి వారంలో మీడియాలో కథనాలు వచ్చిన తరువాత అప్పటి కలెక్టర్ నాగలక్ష్మీ ఆదేశాలతో వివిధ శాఖల అధికారులు ఆగస్టు 31 నుంచి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో శానిటేషన్ అధ్వానంగా ఉన్నా గుంటూరులోనే ఉంటున్న వివిధ శాఖల అధికారులు గ్రామాన్ని సకాలంలో సందర్శించలేదు. మొత్తం మరణాల సంఖ్యపై మీడియాలో కథనాలు వచ్చిన తరువాత అన్ని శాఖల అధికారులు కదిలారు. తురకపాలెం లాంటి గ్రామాలు ఉమ్మడి జిల్లాలో ఎన్నో ఉన్నాయి. మరణాలు ఎక్కువగా నమోదు కాకపోవచ్చు కానీ అధ్వాన పరిస్థితులు నెలకొన్న గ్రామాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

కాన్ఫరెన్సు, ప్రభుత్వ పథకాల అమలు పై దృష్టి తప్ప ప్రజారోగ్యంపై వివిధ శాఖల అధికారులకు శ్రద్ధ కొరవడింది. తురకపాలంలో క్రషర్ వల్ల వాయుకాలుష్యం, దుమ్ముతో శ్వాస కోశ వ్యాధులు వస్తున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే రామాంజనేయులుకు ఆరు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అయినా క్రషర్ ఈనెల 3వ తేదీ వరకు కొనసాగింది. మినరల్ వాటర్ వ్యాపారం కోసం బోర్లు తవ్వారు. గ్రామంలో తాగునీటి కలుషితం జరిగినా పట్టించుకోలేదు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా ఆలకించిన నాథుడు లేరు. తురపాలెంలో అసాధారణ మరణాల అంశంపై పూర్తిస్థాయిలో గతనెల 31న ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించిన తరువాతనే క్షేత్రస్థాయిలో కదలిక వచ్చింది. గ్రామంలో మరణించిన 29 మందిలో 9 మంది అతిగా మద్యం సేవించి లివర్ దెబ్బతినడం కూడా కారణమని చెబుతున్నారు. కానీ ఇందుకు గ్రామంలో బెల్టు షాపులు యథేశ్చగా కొనసాగుతున్నా ఈనెల 2వ తేదీ వరకు ఎవ్వరూ పట్టించుకోలేదు. ఉదయం 6 గంటలకే టి దుకాణాల కన్నా మద్యం విక్రయాలు ప్రారంభం అవుతున్నాయని గ్రామస్తులు మొత్తుకున్నా ఆలకించిన నాథుడు లేరు. ఐదు నెలల కాలంలో 29 మంది మృతి చెందగా రెండు నెలల కాలంలోనే 22 మంది మృతి చెందడంతో ప్రభుత్వంలో కలకలం వచ్చింది. జులై, ఆగష్టు నెలల్లో ఎక్కువ మంది చనిపోయినందున అందుకు గల కారణాలను అధ్యయనం చేయడానికి ఇప్పటి వరకు అనేక పరీక్షలు చేసినా ఇంత వరకు స్పష్టమైన కారణాన్ని కనుగొన లేదు. తురకపాలెం గ్రామంలో ఏప్రిల్ 2025 నుండి సంభవిస్తున్న మరణాలపై అధికారులు పరస్పర నివేదికలు పంపడం వివాదస్పద మైంది. ఇప్పటి వరకు మొత్తం 29మంది మృతి చెందారన్నారు. వీరిలో ఒక్కరు మాత్రమే మెలియోడోసిస్ అనే బ్యాక్టీరియా కారణంగా చనిపోయారని మిగతా వారు వేర్వేరు కారణాలతో చనిపోయినట్టు అధికారులు ప్రాథమిక నివేదికల్లో వెల్లడించారు. మరణించిన వారిలో 17 మందికి జ్వరం, ఊపిరి ఆడకపోవడం వంటి సమస్యలు కేవలం గ్రామంలో కాలుష్య వాతావరణం వల్లే జరిగాయని తెలిసింది. పలువురికి లివర్, కిడ్నీ ఫెయిల్యూర్, మరికొంత మందికి గుండెపోటు వంటి అనారోగ్య సమస్యలను కూడా కారణంగా చూపారు. తురకపాలెం నీటి కాలుష్యంతో పాటు గ్రామంలో వీధులు, మురుగు కాలువలు శుభ్రం చేయక పోవడం, పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగకపోవడం వలన పారిశుద్ధ్య సమస్యలు ఉత్పన్నమై పలువురి మరణాలకు దారితీసినట్టు పలు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు నేతలు పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం ఇంత వరకు ఎవరిపైనా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరణాలకు కారణాలను నిర్ధారించలేదు.

- ఎ.వి.డి.శర్మ

కేరళలో అర్బన్ కాన్క్లేవ్‌లో పాల్గొన్న మేయర్

ప్రజాశక్తి-గుంటూరు



ఇతర ప్రతినిధులతో మేయర్ రవీంద్ర

కేరళలోని కొచ్చిలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించిన అర్బన్ కాన్క్లేవ్‌లో గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ కార్పోరేషన్ల మేయర్లు, కమిషనర్లు, పట్టణాభివద్ధి నిపుణులు పాల్గొని, నగర పాలక సంస్థలలో, పట్టణాలలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ నుండి గుంటూరు మేయర్‌తోపాటు, విశాఖపట్నం మేయర్ పాల్గొన్నారు. జిఎంసి మేయర్ గుంటూరు నగరంలో అమలు చేస్తున్న వినూత్న ప్రాజెక్టులు, పౌరసేవల డిజిటలైజేషన్, మౌలిక వసతుల అభివద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేకంగా ప్రసంగించారు.

మలినేనిలో విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - గుంటూరు

మాట్లాడుతున్న విద్యార్థిని

మొక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వివిధ రకాల సాంకేతిక పోటీలు శనివారం నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్‌లెర్నింగ్, డేటాసైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటాసైన్స్, అనుబంధ శాఖల విద్యార్థులలో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, టెక్నాలజీ అవగాహనకు ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఇంజినీర్స్ డే రోజున సన్మానించి బహుమతులు అందజేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు తెలిపారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని నైపుణ్యం పెంచుకుంటే భవిష్యత్తు ప్రకాశవంతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వరరావు, డీన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాట్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

విజయలక్ష్మి లలిత కళా సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - గుంటూరు

తమ తండ్రి కోకా రాధాకృష్ణమూర్తి పేరున ఫైన్‌ఆర్ట్స్ అకాడమీని స్థాపించి గత తొమ్మిది సంవత్సరాలుగా సంగీత, నృత్య, సాహిత్య రంగాలలో తమ కళా నైపుణ్యం ద్వారా చిన్నారులను తీర్చిదిద్దుతూ దేశ విదేశాలలో కీర్తి గడుస్తున్న కోకా విజయలక్ష్మి లలిత కళా సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కెఆర్‌కెఎం మెమోరియల్ అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై అమరావతి నాట్యోత్సవం 2025 రెండవ రోజు చిన్నారులు, యువ నర్తకి మణుల కూచిపూడి నాట్య ప్రదర్శనలు అలరించాయి. 90 నిమిషాలపాటు తెలుగు కళామతల్లిని కీర్తిస్తూ ప్రదర్శించిన నాట్య ప్రదర్శన అబ్బుర పరిచింది. డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ద్వారా లలిత కళలకు విశేష ప్రాధాన్యతనిస్తూ సంస్కృతిని కాపాడుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, గెట సర్వీస్ ట్రస్ట్ ఛైర్మన్ వెలివేటి మురళి, అభినయ థియేటర్ ట్రస్ట్ అభినయ శ్రీనివాస్, దేవస్థానం సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నాట్య విశారద కోక విజయలక్ష్మి పాల్గొన్నారు.